# పయనించే చిలుక

పాలెపు బుచ్చిరాజు




అప్పటికి ఎనిమిదేళ్ళయింది నేనా రోడ్డు మీద వెళ్ళడం మొదలుపెట్టి. మొదట్లో స్కూటరు మీద వెళ్ళేవాడిని. ఈ మధ్యనే కారు కొన్నాను. డ్రైవర్ని పెట్టుకున్నాను. ముదిరిన వయసు, కొంచెం ఖర్చయినా అదే మంచిది. ఆ రోజుల్లో గవర్నమెంటు ఉద్యోగం నుంచీ రిటైరయిన వెంటనే, నా అనుభవాన్ని పురస్కరించుకుని, ఒక ప్రైవేటు కంపెనీవాళ్ళు నన్ను సలహాదారుగా వేసుకున్నారు. జీతంకూడా బాగానే ఆఫర్ చేశారు. సిరిరామోకాలొడ్డువారుంటారా!

అసలీ సంపాదన అన్నది ఒక వ్యసనం. ముందుగా నిజదార, సులోదరపోషణార్థం ప్రారంభిస్తాడు మనిషి. సరదాకి 'మందు' కొట్టినట్టు, తరువాత అదే వాడి జీవితాన్ని నడిపిస్తుంది. ఖర్చులు, సంపాదన ఒకదానితో ఒకటి పోటీపడి మర్రిచెట్టులా ఎదిగిపోతాయి. అప్పుడు వస్తుంది రిటైర్మెంటు భూతం! రేపట్నుంచీ ఏంచేస్తావోయ్ నేస్తం? అని ఏడిపిస్తుంది.

అదుగో అలాంటి సమయంలో ఎవరో తరుణోపాయం చెపితే కాదనగలనా? అలా ప్రారంభమైంది నేనాఫీసుకి రోజూ ఆరుకిలోమీటర్లు స్కూటరు మీద వెళ్ళడం.

జీవితాన్ని కాచి వడబోసినవాడిని. రోడ్డుమీద ప్రయాణం సాగినంతసేపూ సమయాన్ని వృధాచేయకుండా, పరిసరాల్ని పరీక్షించడం అలవాటునాకు. కార్లలోనూ, నాలా స్కూటర్లమీదా, సైకిళ్ళపైన, కాలినడకన వచ్చేపోయేవారిని, పరిశీలిస్తూ, వారి వారి అవతారాల్నిబట్టీ, హావభావాల్నిబట్టీ వారి వారి ఆర్థికపరిస్థితులూ, జీవనవిధానాలూ, కష్టసుఖాలూ అంచనా వేసుకుంటూ ఉంటాను.

ఆఫీసుకి చేరేముందు అరకిలో మీటరు దూరంలో, సిటీ ఇంజినీరు ఇల్లుంది. సహజంగానే పెద్ద బంగ్లా. లోపల జరిగేవి మామూలు మనుష్యులకి కనిపించకుండా ఎత్తైన ప్రహరీగోడ. అది పేవుమెంటునానుకుని గంభీరంగా నిలబడి ఉంటుంది. ఆ లోపలి ప్రక్కదిట్టంగా ఎరువులు మేసి, ఏపుగా పెరిగిన తురాయి చెట్టొకటి తనశాఖల్ని గోడమీదినుంచీ, పేవు మెంటుమీదకి పెంచి, ప్రజల్ని పలకరిస్తూ ఉంటుంది.

ఆ శాఖల క్రింద, పేవుమెంటుమీద నివసిస్తోందొక కుటుంబం. మనదేశంలో ఈ పేవుమెంటు కుటుంబాలు లేని బస్తీలేదు. ఎన్నికోట్లు? అంటే చెప్పలేం. జయలలిత ఇంట్లో ఉన్నవాటి కంటే ఎక్కువే!

ఆ కుటుంబానికి పెద్ద, ఒక మధ్యవయస్కుడు. అక్కడే రోడ్డు ప్రక్కగా ఉన్న ఎలక్ట్రికల్ స్తంభానికి ఆనుకుని, శూన్యంలోకి చూస్తూ, బీడీ దమ్ములాగుతూండగా చూడాలి అతన్ని. ఏడేడు స్వర్గాల్లో ఉంటాడు. శరీరం అర్థమే ఆచ్ఛాదితం. ఒక తీరువ తెన్నూలేని జునపాల జుట్టు మీసాలు. పేరు తెలియదు. 'అప్పడు' అనుకున్నాను నేను. ఆ సమయంలో అంతకంటే గొప్పపేరు స్ఫురించలేదు. అతని భార్యారత్నం, నల్లగా మసిబొగ్గులా ఉంది. ఒక్క క్షణం ఆలస్యంగా పుట్టి ఉండే గ్రహాలు ఉచ్ఛస్థాయిలోఉండి వజ్రంగా మారిపోయి ఉండేది. అదే ప్రారబ్ధం అంటే.

ఆకాశానికీ భూమికీ మధ్యలో ఎక్కడున్నా సరే, మనిషి శారీరకావసరాలు తీర్చుకోక తప్పదు. జాతిని వృద్ధి పరచుకోక తప్పదు. ఈ జంటకి సుమారు పన్నెండేళ్ళ కూతురు, అయిదేళ్ళ కొడుకూ, మరో ఎడపిల్లా ఉన్నారు. ఇదికాక పిల్లల్ని పెట్టే ఒక మేకా, గుడ్లు పెట్టే కోడిపెట్టా కూడా ఉన్నాయి. అంతా బతికేది అక్కడే! ఆ పేవుమెంటుమీద, తురాయిచెట్టు కొమ్మలనీడనే! అయిదారు అల్యూమినియం బొచ్చెలూ,

రెండుమట్టి కుండలు, మూడు ఇటుకలు చిరిగిన గోనెబస్తాలతో కుట్టిన పెద్ద గోతాములాంటి సంచీ, ఒక ప్రక్కగా నాలుగైదు నల్లసేనపు రాళ్ళు, ఇదీ వాళ్ళ చరాస్తి.

ఒక నెలరోజుల్లో నాకు వాళ్ళ జీవన విధానం బోధపడింది. అప్పడు రాళ్ళని మలిచి, తొలిచి తిరగళ్ళు, రుబ్బురోళ్ళు తయారుచేసి సిటీలో అమ్ముజూపుతాడు. ప్రిస్టేజీగల మహారాజాలున్న ఆ సిటీలో, ఈ హాకర్లమ్మే రాళ్ళకి గిరాకీ ఏముంటుంది? అతని భార్య వీలుచిక్కినప్పుడల్లా ఆ పెద్ద గోతాము భుజాన్ని తగిలించుకుని, ప్లాస్టిక్ సంచులు, సీసాలూ ఏరుకొచ్చి వాటిని రద్దీలో అమ్ముతుంది. పెద్దకూతురు ఇటు పిల్లల్ని చూస్తూ, అటు తల్లికి తోడుగా ఉంటుంది. కొడుకు మాత్రం గడుగ్గాయి. వంశోద్ధారకుడు గదా! ఎప్పుడూ చిన్నచెల్లెల్ని కొట్టీ, తిట్టీ ఏడిపిస్తుంటాడు. ఏనిముషంలో రోడ్డు మీద ఏవాహనం కింద పడతాడో అని తల్లి బెంగ. వర్షాకాలంలో గోతుల్లో నీళ్ళు తూలగొడుతూవాడు ఆనందిస్తూంటే, "ఆహా! అదీ జీవితం అంటే!" అనిపిస్తుంది. కడసారపు దానికి ఆకలి ఎక్కువ. నిద్ర, లేకపోతే ఏడుపు. ఇదీ దాని దిన చర్య.

సంవత్సరం గిరున తిరిగింది.

కంపెనీ వాళ్ళు నా సలహాలకి సంతోషించి జీతం పెంచారు.

అప్పుడు, తురాయి చెట్టు కొమ్మలకి ప్లాస్టిక్ తాడుతో టార్పాలిన్ లాంటి గుడ్డని కట్టబెట్టి "నిలువ నీడ" వేసుకున్నాడు. అతనూ అభివృద్ధిలోకి వచ్చాడని సంతోషించాను.

ఆ సంతోషం నాకు ఎంతోకాలం నిలవలేదు. నాలుగైదు నెలల్లో పెద్దింటి ఇంజినీరుగారు, పెరట్లో తురాయి చెట్టుని కొట్టించేశారు. అదేమని అడిగేదెవరు? అప్పడి గూడుతో బాటి నా సంతోషమూ తునాతునకలైపోయింది. పాపం! అప్పడు మళ్ళీ మొదట్నుంచీ మొదలు పెట్టాలి. చిత్రమేమిటంటే ఆ సంఘటన నన్ను కదిలించినంతగా వారిని కదిలించినట్టులేదు.

రెండేళ్ళు గడిచాయి.

ఇప్పుడు తల్లి స్థానంలో పెద్దపిల్ల వెళుతోంది ప్లాస్టిక్ ఏరుకు రావడానికి. ఈ పిల్లని "నీలి" అన్నాను నేను. నీలి నిజంగానే నీలవేణి! వయసొచ్చింది. శరీరం నిగనిగలాడుతోంది. వయసుతో వచ్చే అందాల్ని పేదరికం బంధించలేదుకదా! వచ్చేపోయే కుర్రకారు ఆ ఇంటి ముందు సైకిళ్ళు గుద్దించుకుంటున్నారు. ఇక దీనికి పెళ్ళి సంబంధాలు చూడాలి అనుకున్నాడు అప్పుడు.

నీలికి కూడా బాధ్యత ఒంటబట్టింది. ఎక్కడెక్కడో, ఎవరెవర్నో అర్థించి, ఇంటి కప్పుకి, గోడలకి కావలసిన సరంజామా సంపాదించింది. అన్నీ చిరిగిన, విరిగిన, డోరియా రేకులు, ఇనుపరేకులు, వాటిని అడ్డుగానూ, నిలువుగానూ నిలబెట్టి, ఇంజినీరుగారి ఇంటి ప్రహరీగోడకి ఆనించి, పెద్ద ప్రయత్నం మీద మళ్ళీ గూడు నిలబెట్టింది. కూడూ, గుడ్డా, గూడూ అవసరాలు అలాంటివి కదా! వాళ్ళ సాహసం చూసి నాకు పట్టు వదలని "సాలీడు" కథ గుర్తుకొచ్చింది.

రోజులు పరుగెడుతున్నాయి. ఏళ్ళు మరో రెండు వెళ్ళాయి.

నేను పనిచేసే కంపెనీ బాగా లాభాలు తీస్తోంది. నా జీతం ఏడాదికేడాదికీ వాళ్ళు పెంచుతూనే ఉన్నారు. పిల్లలు, పెళ్ళిళ్ళు, చదువులు బాధ్యతలు పూర్తయి ఎవరి గూళ్ళకి వాళ్ళు చేరుకున్నారు. పండుటాకులం మేమిద్దరమే అంకంత ఇంట్లో వద్దంటే డబ్బొస్తోంది. మేడమీద మరో రెండుగదులు వేశాను. పిల్లలు, వాళ్ళ పిల్లలూ వస్తే ప్రైవసీ ఉంటుందని.

ఓనాడు నేను ఆఫీసుకి వెళుతూ, వెళుతూ, అప్పడి ఇంటి దగ్గర ఆగి మరీ వెళ్ళవలసి వచ్చింది, వాళ్ళ ఇంటి ముందు, రోడ్డు సగానికి పైగా ఆక్రమించేసి పెద్ద షామియానా వేసి ఉంది. వాహనాలు నెమ్మదిగాపోవలసి వస్తోంది.

మనదేశంలో ఇదొక సుగుణం. పబ్లిక్ ప్రోపర్టీ ఎవరిదీ కాదు కనుక, అందరూ పాడుచేయవచ్చు. అది ఎవరికీ

చెందదు కనుక ఎవరూ ఏమీ అనరు. ఎవరిదారిన వాళ్ళు వెళుతున్నారు తప్ప ఎవరూ విసుక్కోవటం లేదు. కసురుకోవడంలేదు.

అక్కడి హడావుడి చూడగానే నాకు విషయం బోధపడింది. అప్పుడు నీలి పెళ్ళి విషయంలో కృతకృత్యుడయ్యాడన్నమాట. ఇంటినిండా చుట్టాలొచ్చి ఉన్నారు. బాజాల వాళ్ళూ, బాకాల వాళ్ళూ ఉన్నారు. అక్కడే భూమ్యాకాశాలు సాక్షులుగా నీలి వివాహం సంపన్నం అయింది. కోడిపులుసు వాసన ఘుమ ఘుమలాడుతోంది. ఇన్నాళ్ళకి ఆ ఇంట్లో వసంతం తొంగి చూసినందుకు నా హృదయం ఆనందంతో గెంతులు వేసింది.

ఆమర్నాటి నుంచీ ఆ ఇంట్లో రెండు జీవాలు తక్కువ. నీలీ, కోడిపెట్టాను. ఆ ఇద్దరు నేస్తాల్నీ కోల్పోయి మేక ఒంటరిదై "మేః! మేః!" అంటూ ఒకటే గోల. 'ఎదకొచ్చిందో ఏమో ఎదవ మేక!' అని విసుక్కున్నాడు అప్పడు నీలి అత్తారింటికి ఎన్ని వీధులు దాటి వెళ్ళిందో, ఏ పేవుమెంటు మీద మొగుడితో కాపురం చేస్తోందో తెలిసే అవకాశం లేదు నాకు.

సంవత్సరం తిరక్కుండానే ఒకనాడు గుమ్మటంలా ఆ యింటి ముందు తిరగాడుతున్న 'నీలి'ని ఆనవాలు పట్టాను నేను. కడుపుతో వచ్చిన కూతుర్ని కడుపులో పెట్టుకుని, పేవుమెంటు మీదే పురుడుపోసింది తల్లి. ఆడపిల్ల పుట్టింది జాతిని వృద్ధి చేయడానికి. తల్లినీ పిల్లనీ త్రిప్పి పంపింది ఇల్లాలు.

ఈ మధ్య కాలంలో, 'దాచింది చాల్లే' అని నేనొక కారు కొన్నాను. దాన్ని నడపడానికి ఒక డ్రైవర్ని కూడా పెట్టుకున్నాను. ముసలి వయసులో ఏక్సిడెంటు చేసి కాలో చెయ్యో విరిగితే ఎవరు చేస్తారు.? కంపెనీ వాళ్ళు నా విషయంలో చాలా సంతృప్తిగా వున్నారు. డ్రైవరుకి జీతం వాళ్ళే ఇస్తామన్నారు. పెట్రోలు ఖర్చులు కూడా భరిస్తామన్నారు. ఇది ఊహించని పరిణామం. నా విషయంలో.

ఒకనాడు పిల్ల నేసుకుని 'నీలి' పుట్టింట్లో ఉండగా చూసాను. చుట్టపు చూపుగా వచ్చి ఉంటుందిలే అనుకున్నాను. దాని తమ్ముడు ఆకతాయిగా తయారయ్యాడు. ఏదో ఏక్సిడెంటులో కాలు విరిగింది. గవర్నమెంటు ఆసుపత్రిలో నర్సు ఎముకలు ఎగుడు దిగుడుగా అంటించింది. ఇప్పుడు వాడినందరూ "ఒరే సొట్టోడా!" అని పిలుస్తున్నారు. ఇకవాడికి నేను పేరు పెట్టాల్సిన బాధ్యత తప్పింది. రోడ్డు మీద కుళ్ళు నీళ్ళలో ఆడే ఉద్యోగం ఆఖరిదానిమీద పడింది.

ఇంతకీ, ఆర్నెల్లయింది, ఎనిమిది నెలలయింది, నీలి అత్తారింటికి తిరిగి వెళ్ళే సూచనలు కనిపించడం లేదు. నామనసులోని ఈ మథనని ఎలా కనిపెట్టాడో మా డ్రైవరు, ఆ వైనం ఇలా వివరించాడు.

నీలితో పెళ్ళయి, పిల్ల పుట్టేసరికి, ఆ మొగుడి వేడి తగ్గింది. పైగా మరోదాన్ని తగులుకున్నాడు. ఆ ఇద్దరూ కలిసి నీలి జీవితాన్ని 'తాటాకుమంట' చేశారు. మొగుడు తాగి వచ్చి కాలితో కడుపు మీద తన్నుతూంటే భరించలేకపోయింది నీలి. పిల్లతో సహా పుట్టింటికొచ్చేసింది.

ఇది విని నా హృదయం నీరే అయిపోయింది. ఆ మొగుడి వెధవ మీద పట్టరాని కోపం వచ్చింది. వాడి మీద కేసు బనాయిస్తే? పిసరంత రాలదు సరికదా, తన్నులు కొని తెచ్చుకోవడం అవుతుంది. పాపం! నీలిజీవితం ఇంక బాగుపడదా? ఏమిటో! కొందరి ఆనందాలు క్షణభంగురాలు.

మళ్ళీ ఆ జీవాలు, పేవుమెంటు, జీవితాలు మామూలే. కాకపోతే ఈసారి కోడికి బదులు నీలి కూతురు వాళ్ళలో చేరింది. మరిచాను! మేకకూడా రెండు పిల్లల్ని పెట్టింది. గడ్డీగాదం, ఆకులూ అలములూ తినివాటి పొట్ట అవి పోషించుకుంటున్నాయి. గోనెబస్తా మళ్ళీ నీలి భుజాన్నెక్కింది. అప్పడి పెళ్ళానికి పెంచి పెద్ద చేయడానికి ఒక పసిగుడ్డు దొరికింది.

ఇన్ని దయనీయమైన సంఘటనలు నా మనసు మీద చెరగని ముద్ర వేశాయి. అప్పుడు కష్టకాలంలో కృంగిపోయి కంపలా అయిపోతాడని ఊహించాను. అబ్బే! అదేం లేదు.

నిమ్మకు నీరెత్తినట్టున్నాడు. ఇలాగే నావంటి వాడి కుటుంబంలో జరిగితే ఇంకేమైనా ఉందా?

---

నేను కంపెనీలో చేరి ఏడేళ్ళు కావొచ్చింది. ముసలాడినయ్యాను. ఇంక నాకు సెలవిప్పించండని గోల చేయసాగాను. దానిని వాళ్ళు ఇంకోలాఅర్థం చేసుకున్నారు. ఇచ్చే డబ్బుని రెండెట్టి గుణించారు. నా సలహాలు వాళ్ళ కంత నచ్చితే నేను మాత్రం ఎందుకు కాదనాలి?

మొగుడొదిలేసిన నీలి మీద అక్కడి బీటు కానిస్టేబులు కన్నేశాడు. ఎదురుపడి అడిగేస్తే అది చెంప చెళ్ళుమనిపించవచ్చు. మొదటికే మోసం వస్తుంది. అట్నుంచీ నరుక్కురావడంలో పోలీసులు గిరీశానికి గురువులు. వాళ్ళ గుడిసె పేవుమెంటుని ఆక్రమించేస్తోందనీ, అది చట్టవిరుద్ధమనీ, వెంటనే పీకేయకపోతే, వాళ్ళ మీద కేసు పెడతాననీ బెదిరించసాగాడు. కానీ, రోడ్డు మీద గోతాము భుజాన వేసుకుని నీలి నడిచిపోతుంటే లొట్టలు వేసి "ఏంకావలన్నా ఇస్తా"నని పళ్ళికిలించేవాడు. లోగుట్టు పెరుమాళ్ళకెరుక. గుడిసెకి మాత్రం గండం తప్పింది.

ఈ విషయం తెలిసి ఆప్రాంతపు రాజకీయనాయకుడు రంగంలోకి దిగాడు. ఆ ఇంట్లో మూడు ఓట్లున్నాయి వదిలేస్తాడా! "మీకేమీ భయంలేదు. మీతరఫున నేనున్నాను. భయపడకండి. మీఓట్లు మాత్రం నాకే!" అన్నాడు. కామోసనుకుని కుటుంబం అంతా అతనికే ఓట్లు వేశారు. తరువాత ఆ ప్రాంతంలో మళ్ళీ ఆయన కనిపించలేదు.

---

నా మారుతీకారు అవతారం మార్చి ఫోర్డుఇకాన్‌గా మారింది. మాడ్రైవరు స్టేటస్ సింబల్‌గా మీసం పెంచాడు. యూనిఫామ్ వేసుకుంటున్నాడు.

ఇప్పుడు మా సిటీకి క్రొత్త మునిసిపల్ కమీషనర్ వచ్చాడు. ఆయన చండశాశనుడు. అనుకున్న పని నిముషాలమీద జరిగిపోవలిసిందే! మునిసిపాలిటీ సరిహద్దుల్లో, పేవుమెంట్లమీద ఉన్న టీ దుకాణాల్నీ, పళ్ళమ్ముకునే తోపుడు బళ్ళనీ, ఇళ్ళనీ, అన్నింటినీ బుల్ డోజ్ చేయమని ఆర్డరువేశాడు. వీళ్ళంతా వెళ్ళి మొరపెట్టుకున్నారు. నాయకులు కలగజేసుకున్నారు. ఏమీ లాభం లేకపోయింది. కలిగిన నష్టానికి పరిహారం చెల్లిస్తామని మాట యిచ్చాడు. దానితో వారంతా చల్లబడక తప్పలేదు.

బుల్‌డోజర్లు వచ్చాయి. కాంట్రాక్టర్లు లక్షలు జేబులో వేసుకున్నారు. పేవుమెంట్లమీద నిలబడిన ప్రతీ కట్టడమూ నేలమట్టం అయింది. వాటిలో అప్పుడి గుడిసె కూడా ఉంది. వీరికి చెల్లించవలసిన నష్టపరిహారంతో ఒక మోతుబరి మూడంతస్తుల మేడ లేపాడు.

ఆ రోజు ఆఫీసుకి వెళుతూ ఆ అవశేషాల్ని చూస్తే నాగుండె తరుక్కుపోయింది. నేను అడగవలసిన అవసరం లేకుండానే చెప్పాడు డ్రైవరు, వాళ్ళు అక్కడినుంచీ వెళ్ళిపోయారు. బతుకులు చేతబట్టుకుని మరోదారి చూసుకునేందుకు. ఇంకో చిన్న ఊరికి వలసపోయారు.

ఇలాంటి విషయాలు అతనికి బాగాతెలుస్తాయి.

---